క్లుప్తంగా

టీబీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ



రోగులకు సూచనలు చేస్తున్న డాక్టర్ గోపీనాథ్

ఆదోనిఅర్బన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మూడో విడత పౌష్టికాహారాన్ని టీబీ వ్యాధిగ్రస్తులకు పంపిణీ చేశారు. మొత్తం 34 పౌష్టికాహార కిట్లను అందజేసినట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. ఇలా ఆరు నెలల పాటు వ్యాధిగ్రస్తులకు టీబీ మందులను, పౌష్టికాహారాన్ని ఉచితంగా అందజేస్తామని చెప్పారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి వారు వాడే మందులు కూడా బాగా పని చేస్తాయన్నారు. క్రమం తప్పకుండా మందులు, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వ్యాయామం చేయడం, నడవడం లాంటివి చేయాలన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ కృష్ణమూర్తి, టీబీ ఆఫీసర్ షేకున్‌భాను, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షులు ధర్మారెడ్డి, ఈసీ మెంబర్ ఓంప్రకాష్, టీబీ స్టాఫ్ బాబురాజు, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల ర్యాలీ

ఆదోని సెంట్రల్: దేశ సమగ్రత, ఐక్యతను కాపాడేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఆ పార్టీ ఆదోని నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీలకంఠప్ప తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఆదోనిలో నిర్వహించి నేటికి ఏడాది పూర్తి కావడంతో గురువారం స్థానిక కాంగ్రెస్ నాయకులు ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ.. దేశంలో మతకలహాలు పెరిగిపోతున్నాయని, మహిళలకు గౌరవం లేకుండా పోయిందన్నారు. వాటిని నియంత్రించాల్సిన పాలకులు చోద్యం చూస్తున్నారే తప్ప పట్టించుకోవడం లేదని విమర్శించారు. వీటిని దృష్టిలో ఉంచుకొని రాహుల్ గాంధీ దేశం ఒక్కటేనన్న సమత భావంతో యాత్రను కొనసాగించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తప్పకుండా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వస్తుందని పేర్కొన్నారు. ఆ పార్టీ నాయకులు దిలీప్ దోక, మారుతి రావు, దేవిశెట్టి వీరేష్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ఫాతెహాలు



పూజలందుకుంటున్న ఖాదర్‌లింగస్వామి సమాధి

కౌతాళం: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో ఫాతెహాలు నిర్వహించారు. దీంతో దర్గా పరిసర ప్రాంతాల్లో భక్తులతో సందడి నెలకొంది. భక్తులు అధిక సంఖ్యంలో తరలివచ్చి స్వామి సన్నిధిలో గడిపారు. అంతకుముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నా పాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలను చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

పొట్టేళ్ల అపహరణ

తుగ్గలి: మండల పరిధిలోని పీ.కొత్తూరులో మరో పొట్టేలు అపహరణకు గురైంది. ఇంటి సమీపంలోని కొట్టంలో కట్టేసిన పాండుకు చెందిన రెండు పొట్టేళ్లు 25 రోజుల క్రితం అపహరణకు గురికాగా, బుధవారం రాత్రి సురేంద్రకు చెందిన మరో పొట్టేలును దొంగలు ఎత్తుకెళ్లారు. దాదాపు రూ.50 వేల దాకా నష్టపోయినట్లు బాధితుడు వాపోయారు. ఈ మేరకు జొన్నగిరి పోలీసులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నాడు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

హొళగుంద: కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఐ నాయకులు హొళగుందలో కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు పెద్యాట మారెప్ప మాట్లాడుతూ వర్షాభావం వల్ల తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్న రైతులను ఆదుకోవడానికి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాయకులు రంగన్న, కృష్ణయ్య, బాషా, గాదిలింగ, జయరాం తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న ఉల్లి ధరలు

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో ఉల్లి ధరలు పెరిగాయి. ఈ నెల 18న క్వింటాల్ రూ.3,130 ఉన్న ఉల్లి ధర 19న రూ.3,331 చేరింది. గురువారం 37 మంది రైతులు 1,156 క్వింటాళ్ల ఉల్లిని తెచ్చి మార్కెట్‌లో విక్రయించుకున్నారు. కనిష్ట ధర రూ.1950, గరిష్ట ధర రూ.3,331 లభించింది. మోడల్ ధర రూ.2,839 నమోదైంది. ఎండుమిర్చి మార్కెట్‌కు 5 లాట్‌లు వచ్చింది. కనిష్ట ధర రూ.10,501, గరిష్ట ధర రూ.21వేలు కాగా మోడల్ ధర రూ.16,199 నమోదైంది. మొక్కజొన్నలు 153 క్వింటాళ్లు వచ్చింది. కనిష్ట ధర రూ.1,651, గరిష్ట ధర రూ.2,005 లభించగా.. మోడల్ ధర రూ.1,882 నమోదైంది.

సురక్షతో ప్రజారోగ్యానికి భరోసా



చిరుతపల్లిలో ఆరోగ్య సురక్ష కిట్ల పంపిణీ



శిబిరానికి హాజరైన ప్రజలు

ఆదోనిరూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు గురువారం మండలంలోని విరుపాపురం గ్రామంలో జెడ్పీటీసీ అరుణమ్మ, సర్పంచ్ ప్రహ్లాద్‌యాదవ్ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు ఇబ్రహీం, సుస్మిత, పవన్ కుమార్, సురేష్ పాల్గొని వెయ్యి మందికి పైగా రోగులను పరీక్షించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను డీటీ పరిశీలించారు. ఎంపీటీసీ శివకుమార్, ఇన్‌చార్జ్ సీడీపీఓ సావిత్రి, వీఆర్వో తిరుమలరెడ్డి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోసిగి: మండల పరిధిలోని అగసనూరు గ్రామంలో డాక్టర్ అభిరూప్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సు రక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన శిబిరంలో ఓపీ ద్వారా 312 మంది రోగులకు వివిధ ర కాల వైద్య పరీక్షలు చేశారు. ప్రధానంగా కాళ్ల నొప్పు లు, గుండె పోటు, రక్త పరీక్షలు, బీపీ, హెచ్‌బీ, గర్భిణులకు ఆరోగ్య పరీక్షలతో పాటు వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు. మెరుగైన చికిత్స అవసరమైన వారి ని ఆరోగ్య శ్రీ ద్వారా కర్నూలుకు రెఫర్ చేశారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్స్ ఏర్పాటు చేశారు. గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఎంపీహెచ్‌ఈఓ ఎల్లప్ప, శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

కౌతాళం: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టిందని చిరుతపల్లి సర్పంచ్ వందగల్లు నాగమ్మ, మల్లనహట్టి సర్పంచ్ శాంతమ్మ అన్నారు. మండల పరిధిలోని చిరుతపల్లిలో రెండు గ్రామాల ప్రజలకు సురక్ష కార్యక్రమం 15వ రోజు క్యాంపును గురువారం నిర్వహించారు. పాల్గొన్న సర్పంచ్‌లు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకు ని వైద్య సిబ్బంది ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి స్థానికంగానే శిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్ట్ వైద్యులతో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశా రు. శిబిరంలో 295 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా మెరుగైన వైద్యం అవసరమైన నలుగురిని కర్నూలుకు రెఫర్ చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహార స్టాల్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ సుబ్బారాజు, డాక్టర్ ఇమ్మానుయల్ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



విరుపాపురంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డీటీ రజనీకాంత్‌రెడ్డి



ఓపీ నమోదు చేసుకుంటున్న ప్రజలు



అగసనూరులో మాట్లాడుతున్న డాక్టర్ అభిరూప్



వైద్య సేవలందిస్తున్న డాక్టర్

రచ్చమర్రిలో జగనన్న ఆరోగ్య సురక్ష

మంత్రాలయం: మండలంలోని రచ్చుమర్రిలో గ్రామ సచివాలయం-2లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 446 మందికి వైద్య పరీక్షలు చేశారు. అందులో పురుషులు 191, మహిళలు 235 మంది ఉన్నారు. 22 మందికి కంటి పరీక్షలు, 38 మంది గర్భిణులు, 35 మంది చిన్నారులు, విద్యార్థులకు చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ మణిమంజరి, వైద్యాధికారిణి డాక్టర్ వసంత, డాక్టర్ భావన రోగులకు చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

300 మందికి చేదోడు లబ్ధి

తుగ్గలి: ప్రభుత్వం రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్ వృత్తులపై ఆధారపడి జీవించే పేదలకు అందించే 'జగనన్న చేదోడు' పథకం ద్వారా మండలంలో 300 మందికి లబ్ధి చేకూరినట్లు ఎంపీడీఓ సావిత్రి తెలిపా రు. ఈ వృత్తులపై ఆధారపడి జీవించే అర్హులైన వారికి ఏడాదికి రూ.10 వేల చొప్పున ప్రభుత్వం సాయం అందిస్తోందన్నారు. 4వ విడత నిధులను గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎమ్మిగనూరులో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు

క్రీడాపోటీల్లో ప్రతిభ

తుగ్గలి: పగిడ్యాలలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి బి.హరికృష్ణ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఆ విద్యార్థి త్వరలో చిత్తూరు జిల్లా యాదమర్రి గ్రామంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ చందునాయక్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి హరికృష్ణను హెచ్‌ఎం జయలక్ష్మి, పీఎంసీ చైర్మన్ మల్లికార్జున, తదితరులు అభినందించారు.

నేటి సురక్ష వైద్య శిబిరాల షెడ్యూల్

ఆదోని సెంట్రల్: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టింది. ప్రతి గ్రామ/వార్డు సచివాలయాలకు చెందిన ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించి వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. శుక్రవారం ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల షెడ్యూల్‌ను అధికారులు గురువారం విడుదల చేశారు.

మండలం	గ్రామం	ప్రదేశం
ఆదోని పట్టణం	హనుమాన్ నగర్	నీలకంఠేశ్వర టెంపుల్
	టి.జి.ఎల్ కాలనీ	టీటీడీ కళ్యాణమండపం
ఆదోని	చిన్న పెండేకల్	గ్రామ సచివాలయం
కోసిగి	చింతకుంట	ప్రాథమిక పాఠశాల
కౌతాళం	కుంటనహాలు	గ్రామ సచివాలయం

10 నెలల తర్వాత మృతదేహానికి పోస్టుమార్టం



ఎల్లార్తిలో శవ పంచనామా కోసం శ్మశానానికి చేరుకున్న కేరళ పోలీసులు, స్థానిక అధికారులు

హొళగుంద: చనిపోయిన 10 నెలల తర్వాత శవానికి పోస్టుమార్టం నిర్వహించిన ఘటన ఎల్లార్తి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఓ కేసుకు సంబంధించి కేరళ పోలీసుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దాదాపు 10 నెలల క్రితం ఎల్లార్తి గ్రామానికి చెందిన గజేంద్ర (35) అనే వ్యక్తి అయ్యప్ప దీక్ష ధరించి శబరిమలైకు బయలుదేరారు. యాత్రలో ఉండగానే కేరళలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గజేంద్రను కుటుంబ సభ్యులు ఇక్కడికి తీసుకొచ్చి చికిత్స చేయించారు. ఇక్కడ కోలుకోలేక గజేంద్ర మృతి చెందగా గ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించారు. కేరళలో యాక్సిడెంట్ కేసు నమోదైనా మృతదేహానికి పోస్టుమార్టం జరగకపోవడంతో పాటు గజేంద్ర మృతిపై అనుమానం ఉందని భార్య సంధ్య ఇటీవల కేరళలో కేసు పెట్టింది. దీంతో ఎల్లార్తికి చేరుకున్న కేరళ పోలీసులు స్థానిక అధికారులు తహసీల్దార్ హుసేన్‌సాహెబ్, హెడ్ కానిస్టేబుల్ నాయక్, వీఆర్‌ఓ ప్రహ్లాద సమక్షంలో గురువారం గజేంద్ర మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు.

కోలుకోలేక రైతు మృతి



మృతి చెందిన రైతు బాలకృష్ణ

వెల్దుర్తి: మండల పరిధిలోని ఎస్.పేరేముల గ్రామానికి చెందిన రైతు బాలకృష్ణ (39) కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య రామేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. రైతు బాలకృష్ణ తన సొంత పొలం ఎకరాతో పాటు, 6 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం భార్యతో కలిసి వెళ్లి తన పొలంలోని కంది పంటకు పురుగు మందు పిచికారీ చేసి భార్యకంటే ముందుగా ఇంటికి వచ్చాడు. కొంత సేపటి తర్వాత భార్య ఇంటికి వచ్చి చూడగా అప్పటికే పురుగు మందు తాగి పడి ఉన్నాడు. ఆందోళన చెందిన భార్య చుట్టుప్రక్కల వారి సహాయంతో భర్తను వెల్దుర్తి ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న బాలకృష్ణ కోలుకోలేక మృతి చెందాడు. వ్యవసాయానికి, కుమారుల చదువులకు తెచ్చిన అప్పులు తీర్చలేనన్న మనస్తాపంతో భర్త పురుగు మందు తాగినట్లు రామేశ్వరి తన ఫిర్యాదులో పేర్కొంది. ఏఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారి షేక్ మాబువలి

వెల్దుర్తి: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల మహా సమాఖ్య సమావేశంలో పొదుపు గ్రూపు ప్రతినిధులు, సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాది. ఏపీఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రకృతి వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ యాంకర్ మాబువలి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఉత్పత్తులతో ఆరోగ్యంతోపాటు, లాభదాయకమన్నారు. ప్రతి సభ్యురాలు వారికి ఉన్న భూమిలో కొంతైనా ప్రకృతి వ్యవసాయం చేపట్టాలన్నారు. భూమిలేని వారు పెరటి తోటలు సాగు చేసుకుని ఆకుకూరలు, కూరగాయలు పండించుకోవచ్చన్నారు. ఒక దేశీయ ఆవుతో 20 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేయవచ్చని వివరించారు. ఆ శాఖ సిబ్బంది, సీసీలు పాల్గొన్నారు.

ఎల్లార్తి దర్గాల్లో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు



హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. దర్గాలో మొక్కులు చెల్లించుకోవడానికి జిల్లా నుంచే గాకుండా కర్ణాటక, తెలంగాణ తదితర దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ప్రత్యేక ఫాతెహాల్లో పాల్గొని దేవుళ్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాత దర్గాలు, షిర్డిసాయిబాబా ఆలయాలను భక్తులు దర్శనం చేసుకున్నారు.

నేటి నుంచి రిలే నిరాహార దీక్షలు




పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: జిల్లా కేంద్రంలో ఈ నెల 20, 21వ తేదీల్లో నిరవధిక నిరహార దీక్షలు చేపట్టనున్నట్లు ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ నరసింహులు, ఎస్టీయూ పురపాలక కమిటీ సభ్యులు రమేష్ నాయుడు తెలిపారు.గురువారం ఎస్టీయూ భవనంలో డివిజన్ స్థాయి కార్యకర్తల సమావేశం మండలాధ్యక్షుడు ఎం.సి.సుంకన్న అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆర్థిక బకాయిలు అయినటువంటి ఆర్జిత సెలవులు, ఏపీజీఎల్ఐసీ బకాయిలు, 11వ పీఆర్సీ డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఎస్టీయూ సీనియర్ నాయకులు గోపాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ప్రతి ఒక్కరు దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్టీయూ నాయకులు రామమోహన్‌రెడ్డి, కె.దాసన్న, హెచ్. ఈరప్ప, వెంకటేష్, సుధాకర్‌బాబు, చిరంజీవి పాల్గొన్నారు.



లలితాదేవి రూపంలో మహంకాళి మాత



కేసరిబేడల అలంకరణలో మహాయోగి లక్ష్మమ్మవ్వ



మహాలక్ష్మి అలంకరణలో అంబాభవానీ మాత



లలితాదేవి అలంకరణలో పరమేశ్వరిదేవి



లలితాదేవి అలంకరణలో పరమేశ్వరిదేవి

లలితాదేవి నమోస్తుతే



ధనలక్ష్మి అలంకరణలో వాసవీ అమ్మవారు



మంత్రాలయంలో గజవాహనంపై మంచాలమ్మ



కందుకూరులో స్కందమాత అలంకరణ



కౌతాళంలో పూజలందుకుంటున్న అమ్మవారు

ఆదోనిఅర్బన్: ఆదోని పట్టణంలో దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కేసరిబేడలు అలంకారంలో ఆదోని ఇలవేల్పు మహాయోగి లక్ష్మమ్మవ్వ వారు, లలితాదేవి రూపంలో షరాఫ్‌బజార్‌లోని మహంకాళీ మాత, శ్రీ మహాలక్ష్మి అలంకారంలో ఫారెస్ట్‌లైన్ అంబాభవానీ మాత, లలితాదేవి అవతారంలో ఎంఎం కాలనీలోని మాతాపరమేశ్వరిదేవి, రుద్రాక్ష అలంకారంలో పేటవీరభద్రేశ్వర స్వామి, ధనలక్ష్మి అలంకారంలో నగరేశ్వర స్వామి ఆలయంలో వెలిసిన వాసవీ అమ్మవారు దర్శనమిచ్చారు.

కోసిగి: మండలంలోని కందుకూరు గ్రామంలో వెలసిన శాంభవీ దేవి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజున అమ్మవారు స్కందమాత దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. గురువారం ఆలయంలో అర్చకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణ గావించారు. వెండికవచ అలంకరణ, ఫల, పుష్పాలంకరణ గావించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు స్కందమాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ పరిషత్ కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నంద్యాలకు చెందిన ఎం.మద్దయ్యస్వామి చేత రెండవ రోజున సాయంత్రం ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ధార్మిక ప్రవచనాలు వినిపించారు.

గజలక్ష్మి అలంకరణలో మంచాలమ్మ

మంత్రాలయం: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు గ్రామ దేవత మంచాలమ్మ గజలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శమిచ్చారు. పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వాసవీ సంఘం ఆధ్వర్యంలో కొలువు తీరిన దుర్గా మాత మహాచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

కౌతాళం: మండలంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పుష్పాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున జమ్మిచెట్టును పూజించి మొక్కులు తీర్చుకున్నారు. కౌతాళంలో చౌడేశ్వరిదేవి ఆలయంలో, ఈరన్న కట్టవద్ద ఉన్న మహంకాళి దేవి దేవాలయం వద్ద, కౌతాళం శివారులో వెలసిన ఆదిబసవేశ్వర స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు.

ఈ ఎముకలకేమైంది!

- మెత్తబడుతున్న ఎముకలు
- ఆస్టియోపోరోసిస్ వ్యాధితో సతమతం
- పాతికేళ్ల క్రితం 60 ఏళ్ల తర్వాత ఈ సమస్య
- ఇప్పుడు యుక్త వయస్సు వారికీ వేధింపు
- జిల్లాలో 5 శాతం మందిలో సమస్య
- నేడు ప్రపంచ ఆస్టియోపోరోసిస్ దినోత్సవం



సాధారణ ఎముక, ఆస్టియోపోరోసిస్ సోకిన ఎముక

కర్నూలు(హాస్పిటల్): ఇటీవల కాలంలో మనిషి బిజీ లైఫ్ కారణంగా తన ఆరోగ్యం గురించి పట్టించుకోవడం మానేశాడు. దీనివల్లే ఎన్నో ప్రమాదకరమైన రోగాల బారిన పడుతున్నాడు. ఇందులో బలహీనమైన ఎముకల సమస్య(ఆస్టియోపోరోసిస్) ఒకటి. ఇది ఎన్నో అనారోగ్య సమస్యలకు దారి తీ స్తోంది. కానీ దీని గురించి ప్రజలకు తక్కువగా అవగాహన ఉంది. అందుకే ఏటా అక్టోబర్ 20న ప్రపంచ ఆస్టియోపోరోసిస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

జిల్లాలో ఆస్టియోపోరోసిస్ వ్యాధి(బోలు ఎముకల వ్యాధి) బాధితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. ఒకప్పుడు 60 ఏళ్ల తర్వాత కనిపించే ఈ వ్యాధి ప్రస్తుతం 30 నుంచి 40 ఏళ్లలోనే కనిపిస్తోంది. పాతికేళ్ల క్రితం ఇలాంటి సమస్యతో 2 నుంచి 3 శాతం మంది బాధపడే వారు. ప్రస్తుతం 4 నుంచి 5 శాతం మధ్య ఉన్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. నడుము, వెన్నెముక, మెడనొప్పి, మోకాళ్లు, కండరాల నొప్పులతో వైద్యుల వద్దకు వచ్చేవారిలో ఆస్టియోపోరోసిస్ సమస్య ఎక్కువగా బయటపడుతోంది. దీనిని ప్రారంభంలోనే నియంత్రించుకోవాలని, లేకపోతే భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఆస్టియోపోరోసిస్ అంటే..

ఆస్టియోపోరోసిస్‌ను తెలుగులో బోలు ఎముకల వ్యాధి అంటారు. దీని కారణంగా ఎముక ఖనిజ సాంద్రత తగ్గుతుంది. ఫలితంగా తడిగా ఉన్న గోడ నుంచి ప్లాస్టర్ పడిపోయినట్లుగా ఎముక పౌడర్‌గా పడిపోతుంది. ఈ వ్యాధి కారణంగా ఎముకలు చాలా బలహీనంగా మారిపోతాయి. గతంలో మహిళల్లోనే ఇది ఎక్కువగా కనిపించేది. ఇప్పుడు పురుషుల్లోనూ ఎక్కువగా బయటపడుతోంది. దీని వల్ల వెన్ను, నడుము, మెడ, మోకాళ్లనొప్పులు సర్వసాధారణంగా కనిపిస్తున్నాయి.

ఎందుకు వస్తుందంటే..

సాధారణంగా ఇది 45 ఏళ్లు పైబడిన మహిళల్లో, మెనోపాజ్ దశకు చేరుకున్న వారిలో కనిపిస్తుంది. తగినంత సూర్యరశ్మిని అందని వారు, వ్యాయామం చేయని వ్యక్తులు కూడా దీనిబారిన పడే అవకాశం ఉంది. మద్యపానం, పొగతాగే అలవాటు ఎక్కువగా ఉన్న వారికి, శరీరంలో కాల్షియం స్థాయిలు తక్కువగా ఉన్న వారిలో, కుటుంబంలో ఇంతకు ముందే ఎవ్వరికైనా ఈ వ్యాధి సోకితే జన్యుపరంగానూ ఇది వ్యాపించవచ్చు. ఇటీవల కాలంలో ఎక్కువ మంది ఏసీ సౌకర్యం ఉండే జిమ్‌లలో వ్యాయామం చేస్తున్నారు. అలా గాకుండా పార్కులు, సూర్యరశ్మి తాకే చోట వ్యాయామం చేయడం ఉత్తమం. దీనివల్ల శరీరానికి డి విటమిన్ లభిస్తుంది. దీంతో ఎముకలు బలంగా మారే అవకాశం ఉంటుంది.

ఆస్టియోపోరోసిస్ లక్షణాలు

వెన్నునొప్పి, శరీరాకృతి వంగిపోవడం, ఎత్తు తగ్గుతున్నట్లు కనిపించడం, చిన్న ప్రమాదాలకే ఎముకలు విరిగిపోవడం వంటివి ఆస్టియోపోరోసిస్ వ్యాధి లక్షణాలు. వెన్నుపూసలో పగుళ్లు ఏర్పడితే వెన్నుముక, తుంటి ప్రాంతంలో నొప్పి వస్తుంది. సరైన నివారణ చర్యలు తీసుకోకపోతే కొంత మంది మహిళల్లో ఇది మూపురంలా పెరుగుతుంది. తుంటి ఎముకలో ఏర్పడే పగుళ్లు(హిప్ ఫ్రాక్చర్) త్వరగా నయం కావు. పూర్తిగా కోలుకోవడానికి చాలా సమయం పడుతుంది.

వ్యాధి నిర్ధారణ

ఎక్స్‌రే ద్వారా ఈ వ్యాధిని నిర్ధారించవచ్చు. తక్కువ లక్షణాలు ఉండే వారిలో ఎముకలు పెళుసుగా మారాయని తెలుసుకోలేరు. ఇలాంటి అతి చిన్న లక్షణాలు గుర్తించేందుకు, సరైన చికిత్స అందించడానికి డీఈఎక్స్ స్కాన్(బోన్ డెన్సిటీ స్కాన్) చేయాల్సి వస్తుంది.

ఇవి మానేయాలి

- మితిమీరిన మద్యపానంతో ఎముకలు గుల్లగా మారతాయి.
- ధూమపానంతో ఎముకల సాంద్రత తగ్గి బలహీనమై తేలికగా విరుగుతాయి. శరీరంలోని ఈస్ట్రోజన్ హార్మోన్ సామర్థ్యం తగ్గి ఎముకలు బలహీనమవుతాయి.
- విపరీతంగా వ్యాయామం చేసే అమ్మాయిల్లో అస్తవ్యస్త రుతుక్రమం, ఎముకలు పలచబడతాయి. సరైన ఆహారం తీసుకోకుండా అవసరానికి మించి వ్యాయామాలు చేసే వారిలో ఈ ఇబ్బందులు ఉంటాయి. దీనివల్ల ఈస్ట్రోజన్ హార్మోన్ తగ్గి ఎముకలు బలహీనమవుతాయి.
- శీతల పానియాలు అతిగా తీసుకోవడం. ఇందులో ఉండే అదనపు ఫాస్పరస్ శరీరం కాల్షియం తీసుకునే సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది.

ఇలా చేయాలి

శరీరంలో సరిపడా కాల్షియం లేకపోతే తన అవసరాల కోసం శరీరం ఎముకల నుంచి కాల్షియం తీసుకుంటుంది. ఫలితంగా ఎముకల సాంద్రత తరిగిపోతుంది. కాబట్టి ప్రతిరోజూ ఆహారంలో సరిపడా కాల్షియం శరీరానికి అందిస్తూ ఉండాలి. ఇందుకోసం ఫ్యాట్ ఫ్రీ పాలు, సోయాపాలు, టోఫు, తృణధాన్యాలు తీసుకోవాలి. ముదురు ఆకుపచ్చ రంగులో ఉండే బ్రోకొలి లాంటి కూరగాయలు ఎంచుకోవాలి. విటమిన్-డి కోసం ప్రతిరోజూ ఉదయం లేదా సాయంత్రం సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి. చీజ్, గుడ్లు తినాలి.